క్లుప్తంగా

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల పోలిమేర కోటపాటు మెట్ట వద్ద పంచవటి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు స్వామివారికి గంగాయనం, గోమాత పూజ, మహా గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, అకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజ కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం


కల్యాణ మండపం నిర్మాణం చేపట్టడానికి పూనాదులు తీస్తున్న పొక్లెయిన్

బేతంచెర్ల: మండలంలోని శైవ పుణ్యక్షేత్రమైన శ్రీ ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులకు రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సుమారు 15 నెలల తరువాత ఆలయ నిర్మాణ పనులను కంట్రాక్టర్ బుధవారం ప్రారంభించారు. ఆలయంలో ముందుగా కల్యాణ మండపం నిర్మాణ పనులు చేపట్టారు. ఫ్లోరింగ్, గాలిగోపురం పునరుద్ధరణ పనులు కూడా చేపడతామని కంట్రాక్టర్ తెలిపారు.

ఎయిడ్స్ నిర్మూలనకు సహకరించండి


బేతంచెర్లలో ఎయిడ్స్ కళాజాత బృందం ప్రదర్శన

బేతంచెర్ల: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహరించాలని వైద్యులు వెంకటేశ్వర్లు, దంత వైద్యులు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హ్యాండ్స్ ప్రాజెక్టు మేనేజర్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు రైతులకు 50 శాతం రాయితీతో రూ.61.50 చొప్పున ఎకరాకు పది కిలోల ప్రకారం అందజేస్తామన్నారు. గరిష్టంగా రైతులకు ఐదు ఎకరాలకు 50 కేజీల విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. వరి సాగు చేసే రైతులు జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోని పచ్చి రొట్టె ఎరువుగా సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలని సూచించారు. విత్తనాల కోసం రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

22, 23న నీటి సరఫరా బంద్

డోన్: పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లోనున్న 1500 కిలో లీటర్ల సామర్థ్యం గల ట్యాంకుకు మంచినీటి సరఫరా చేసే 400 ఎంఎం పైపు లైన్ లీకేజీ ఉన్నందున రెండు రోజుల పాటు ప్రజలకు మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగనుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో చిగురుమానుపేటలోని 1500 ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుకు మంచినీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నామన్నారు. దీంతో 12 నుంచి 17వ వార్డు వరకు రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని వెల్లడించారు. పైపులైన్ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నందువల్ల 24వ తేదీ ఉదయం నీటి సరఫరా యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.

వీధి కుక్క దాడి 17 మందికి గాయాలు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ఓ విధి కుక్క స్వైర విహారం చేసింది. దాదాపు పది రోజుల నుంచి గ్రామంలో వరుసగా 17 మందిని కరిచింది. ఆ కుక్క వస్తుందంటేనే ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఎంతమంది కుక్కకాటుకు గురైన గ్రామ పంచాయితీ అధికారులు పంట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి కుక్క నుంచి విముక్తి కలిగించాలిన స్థానికులు కోరుతున్నారు.

రేషన్ బండి.. ఇక రాదండి!

- ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- వచ్చే నెల నుంచి సరుకుల కోసం రేషన్ షాపులకు పరుగులు పెట్టాల్సిందే
- వృద్ధులు, మహిళలకు మళ్లీ ఇక్కట్లే
- ఉపాధి కోల్పోతున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు, హెల్పర్లు

నియోజకవర్గంలో వాహనాల వివరాలు

మండలం	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
కొలిమిగుండ్ల	16,227	10
అవుకు	16,074	10
సంజామల	12,062	08
కోవెలకుంట్ల	14,064	09
బనగానపల్లె	36,139	19

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేస్తూ వచ్చిన కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం తొలగిస్తోంది. రేషన్ దుకాణాల వద్ద సరుకుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి ఇంటింటికి సరుకులు అందించే బృహత్తరమైన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది. అయితే కూటమి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ సరుకులు అందించే పథకానికి స్వస్తి పలికింది. ఇకపై కార్డు దారులు సరుకుల కోసం ప్రతినెలా చౌకదుకాణాల వద్దకు పాత రోజుల్లో తరహాలోనే పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఐదేళ్లుగా ప్రజలకు సేవలందించిన ఎండీయూ వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోనున్నాయి.

రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించాల్సిందే

కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో కార్డుదారులు గ్రామాల్లో రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించాల్సి వస్తుంది. 2021 ఏప్రిల్ వరకు రేషన్ షాపుల వద్ద సరుకులు పొందేవారు. కొన్ని గ్రామాల్లో డీలర్లు లేక పోవడంతో పొరుగు గ్రామాలకు చెందిన డీలర్లు సరుకులు అందించేవాళ్లు. డీలర్లు ఎప్పుడు ఇస్తే అప్పుడే సరుకులు తీసుకునే పరిస్థితి ఉండేది. పైగా సరుకుల పంపిణీలో అవకతవకలు చోటు చేసుకునేవి. దీంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు సరుకుల కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి లేకుండా ఉండేందుకు దేశంలో ఎక్కడా లేని రీతిలో ఇంటికే సరుకులు అందించేలా ఎండీయూ వాహన వ్యవస్థను తీసుకొచ్చారు.


ఎండీయూ వాహనం వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు (ఫైల్)

ఉపాధి కోల్పోనున్న ఎండీయూ ఆపరేటర్లు

బనగానపల్లె నియోజవర్గంలో 94,566 కార్డులు ఉండగా 56 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఇంటింటి రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహన ఆపరేటర్ల ఉపాధిపై కూటమి ప్రభుత్వం దెబ్బకొట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంతా రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రతి వాహనానికి ఆపరేటర్‌తో పాటు హెల్పర్ ఉంటారు. వీరికి ప్రతి నెలా వివిధ రకాల వాటి కోసం ప్రభుత్వం రూ.21 వేలు చెల్లిచేది. జూన్ 1వ తేదీ నుంచి ఎండీయూ వాహన సేవలు మూలన పడనుండటంతో ఆపరేటర్లు, హెల్పర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ఎండీయూ వాహనమే జీవనాధారం



ఎండీయూ వాహనం ద్వారా ఉపాధి పొందుతున్నాం. నాలుగేళ్ల నుంచి వాహనాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ప్రతి నెలా 15వ తేదీ లోగా ఇంటింటికి వెళ్లి సరుకుల పంపిణీ పూర్తి చేసేవాళ్లం. ప్రభుత్వం వాహనాలను రద్దు చేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వీటిపై ఎన్నో కుటుంబాలు ఆధారపడ్డాయి.

– నాగయ్య,ఎండీయూ ఆపరేటర్,కొలిమిగుండ్ల

రద్దు చేయడం మంచిది కాదు



ప్రతి నెలా రేషన్ సరుకులు ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటి వద్దకు వచ్చి ఇచ్చేవాళ్లు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని రద్దు చేయడం మంచిది కాదు. పల్లెల్లో ఈసేవలు బాగా ఉండేవి. ప్రభుత్వం ఇప్పుడు తీసుకున్న నిర్ణయం వల్ల దూరంగా ఉన్న రేషన్ షాపులకు వెళ్లి అతి కష్టం మీద సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది.

– సుబ్బరాయుడు, బెలుం

న్యాయం జరిగే వరకు పోరాటం


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: కాలుష్యం వల్ల పంటలు నష్టపోయిన కల్వటాల, చుట్టు పక్కల గ్రామాల రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు అన్నారు. బుధవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మండల రైతు సంఘం నాయకులు పుల్లయ్యతో పాటు పలువురు రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి రవాణ వాహనాల వల్ల దుమ్ముతో పంటల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయం పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి రామ్‌కో ప్రతినిధులతో చర్చలు జరుపుతామని వారం రోజుల క్రితం హామీ ఇచ్చారన్నారు. హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్దయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కామిని ప్రతాప్‌రెడ్డి, వినయ్, చిన్ని, శరత్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి


రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ విశ్వనాథ్

కొలిమిగుండ్ల: భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ సూచించారు. బుధవారం తుమ్మలపెంటలో జరుగుతున్న రీసర్వే పనులను తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. డివిజన్‌లో 14 గ్రామాల్లో రీసర్వే చురుగ్గా జరుగుతున్నాయన్నారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని సూచించారు. రైతుల మధ్య భూవివాదాలు ఏర్పడకుండా ఉండేందుకు రీసర్వే చేస్తున్నామన్నారు. సర్వే సమయంలో ఏవైనా అభ్యంతరాలుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పొరపాట్లకు అవకాశం లేకుండా సర్వే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విశ్వతేజ, మండల సర్వేయర్ సరిత పాల్గొన్నారు.

రోడ్డుపైకి కంపచెట్లు.. వాహనదారులకు ఇక్కట్లు


మంగపల్లె గ్రామ సమీపంలో రోడ్డు మీదకు వాలిన కంపచెట్లు

సంజామల: మండల కేంద్రం సంజామల నుంచి పేరుసోముల వెళ్లే రహదారిలో కంపచెట్లు, పచ్చిమెక్కలు పెరిగి రోడ్డుపైకి వాలడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిలో రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారుడు ఏమాత్రం ఏమరపాటు వహించిన ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. సంజామల నుంచి పేరుసోములకు సింగిల్ రోడ్డు కావడం, ఇరువైపులా కంపచెట్లు కొమ్మలు రోడ్డుకు మీదకు రావడంతో వాహనాలకు అడ్డంకిగా మారింది. దీని వల్ల రోడ్డు ఇరువైపులా ఉన్న గుంతలు కనబడక అందులో పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే రోడ్ల ఇరువైపుల కంపచెట్లు, పచ్చిమొక్కలు తొలగించాలని కోరుతున్నారు.

మాన్యం కౌలుకు వేలం


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): మండలంలోని అయ్యలూరు గ్రామ ఆలయ భూముల కౌలుకు బుధవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక రామాలయ ఆవరణలో ఈఓ వేణునాథరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 51 ఎకరాలను 10 మంది ఎక్కువ మొత్తంలో పాట పాడి దక్కించుకున్నారు. దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో 51 ఎకరాల భూములకు రూ. 9.27 లక్షలు రాగా ఈఏడాది రూ. 12.27 లక్షలు కౌలు వేలం వచ్చిందన్నారు. దీంతో రూ. 3 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఓలు రామాంజనేయశర్మ, బాల చెంచన్న, గ్రామ పెద్దలు త్రిలింగేశ్వరరెడ్డి, శంకరమ్మ, ఈశ్వరరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


కాలనీలో నీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

పీఆర్ పల్లిలో దాహం..దాహం

ప్యాపిలి: మండలంలోని పీఆర్ పల్లి ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కాలనీ వాసుల దాహార్తి తీర్చేందుకు వేసిన బోరుకు ఉన్న మోటార్‌ను కొద్ది నెలల క్రితం బీసీ కాలనీలోని బోరుకు అమర్చారు. దీంతో కాలనీలో నీటి ఎద్దడి తలెత్తింది. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా ప్రయోజనం లేకపోయిందని మహిళలు రంగమ్మ, నాగేంద్రమ్మ, రామాంజినమ్మ, రాణి, సులోచన, సుంకులమ్మ వాపోయారు. గుక్కెడు నీటి కోసం గ్రామ శివారులోని వ్యవసాయ బావుల వద్దకు కిలోమీటర్ల కొద్ది నడచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో అన్ని వీధులకు సక్రమంగా నీటి సరఫరా అవుతోందని, కేవలం మా కాలనీకి మాత్రమే రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నీటికి సంబంధించిన వాల్వ్‌ను తమ కాలనీలోకి వచ్చేలా తిప్పినా కొందరు దౌర్జన్యానికి పాల్పడుతూ వాల్వ్‌ను బంద్ చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని శ్రీ పద్మావతి జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్, శ్రీ వెంకటేశ్వర జూనియర్ బాలుర కళాశాలలో ఫస్టియర్‌లో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని టీటీడీ సంస్థ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. పదవ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులకు రూ.5350, ఎంఈసీ,సీఈసీ, హెచ్ఈసీ వారు రూ.4,400 సంవత్సరానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బాలికలకు 450 మందికి, బాలురకు 400 మందికి హాస్టల్ సీట్లు వేర్వేరుగా ఉంటాయన్నారు. జూన్ 5న మెరిట్ లిస్టు ప్రకటించి జూన్ 9 నుంచి ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ


బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటుకున్నఅర్చన

ప్యాపిలి: పట్టణానికి చెందిన అర్చన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఆత్మకూరులోని కేవీకే సెంటర్‌లో బుధవారం జరిగిన బాక్సింగ్ పోటీల్లో అర్చన ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఈ నెల 25వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్చన ఎంపికైంది.

నేడు హనుమజ్జయంతి

మహానంది: హనుమజ్జయంతి సందర్భంగా మహానంది మండలంలో గురువారం వేడుకలు నిర్వహించనున్నారు. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు గాజులపల్లె ఆర్ఎస్, తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

శ్రీశైలంలో..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని గురువారం పాతాళ గంగ మార్గంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు.

హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి

కొలిమిగుండ్ల: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం కొలిమిగుండ్లలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు భక్తులు తరలిరావాలని ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుంచి 200 బైక్‌లతో శోభాయాత్ర మొదలై ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్ మీదుగా మీర్జాపురం సమీపంలో ఉన్న పొలిమేర ఆంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు హనుమాన్ జయంతి

బనగానపల్లె : పట్టణ సమీపంలోని రవ్వలకొండపై ఉన్న బాలాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. జయంతి సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, బాలాంజనేయస్వామికి నవజీవా పంచామృబిషేకం, శతనామ పూజలు కుంకుమార్చన, ఆకు పూజ తదితర పూజలు ఉంటాయన్నారు. భక్తులకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి

బేతంచెర్ల: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో మన ఊరు–మన గుడి సభ్యుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు సభ్యుడు అజయ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వికాస నిలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్రలో కర్ణాటక కళాకారులతో హనుమాన్ సూట్ మ్యాన్ ప్రదర్శన, మహిళల కోలాటం ఉంటాయని చెప్పారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అందరి సహకారంతోనే బాల్య వివాహాల కట్టడి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ప్యాపిలి: అన్ని శాఖల సమన్వయంతోనే బాల్య వివాహాలను కట్టడి చేయవచ్చని తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, బాలల సంరక్షణాధికారి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దేవకృపమ్మ, శకుంతల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, అంగన్‌వాడీ టీచర్లు బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098, 100, 181 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన బోయ మహాలక్ష్మీ

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ మహాలక్ష్మీ (20) అనే వివాహిత మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. పలుకూరు గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి కుమార్తె బోయ మహాలక్ష్మీ, భర్త గోవర్దన్ పలుకూరు నుంచి మోటార్ సైకిల్‌పై లక్ష్మపల్లెకు బయల్దేరారు. అయితే ఇల్లూరు కొత్తపేట సమీపంలోని మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో మహాలక్ష్మీ బైకుపై నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే ఆమె కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి 8 నెలల కుమార్తె ఉంది.

‘కూటమి’ పాపం.. రోగులకు శాపం

- వైఎస్సార్‌సీపీ హయాంలో 90శాతం పనులు పూర్తయిన ఉడుములపాడు విలేజ్ హెల్త్ క్లీనిక్
- పనులు పూర్తి చేయని రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీకి పేరువస్తుందనే పనులు నిలిపివేత
- మెరుగైన వైద్య సేవలు అందక రోగుల అవస్థలు



అసంపూర్తిగా నిలిచిన ఉడుములపాడులోని విలేజ్ హెల్త్ క్లినిక్

డోన్ రూరల్ : పల్లెవాసులకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల కోసం భవనాలు నిర్మించి అవసరమైన సామగ్రి, వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేసింది. అయితే కొన్ని కారణాలతో భవన నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. మండలంలోని ఉడుములపాడు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానం 90శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ లోపు సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నాటి నుంచి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు గడుస్తున్నా పనులు పునఃప్రారంభం కాలేదు. దీంతో రోగులకు వైద్య సేవలందడం లేదు. నిర్మాణం పూర్తి చేస్తే గ్రామస్తులకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ఊర్లోనే వైద్య సేవలందుతుండటంతో ఆపద సమయంలో ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉంటుంది. స్థానిక టీడీపీ నాయకులు పనుల సమాచారంతో పనులు నిలిచిపోయాయని, నిర్మాణం పూర్తియతే వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే నిర్మాణ పనులు ముందుకు సాగకుండా చేశారని స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

చనుగొండ్ల, ఉడుములపాడు గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు పూర్తి కాలేదు. వాటి గురించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వాటిని పూర్తి చేసి ప్రజలకు సేవలు అందించేలా అందుబాటులోకి తీసుకొస్తాం.

– నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డోన్ .

చొరవ చూపని కూటమి ప్రభుత్వం



గత ప్రభుత్వంలో గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. ప్రసుత్తం పనులు నిలిచి పోయాయి. మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో పనులు నిలిచిపోయాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయి. కూటమి ప్రభుత్వం చొరవ చూపి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– నాగమద్దయ్య, ఉడుములపాడు

అభివృద్ధిని గాలికొదిలేశారు



రెడ్ బుక్ రాజ్యాంగం తప్ప అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అసంపూర్తిగా మిగిలినపోయిన విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలి. చిత్తశుద్ధి లేకపోవడం, వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందనే పనులను నిలిపేశారు.

– వీరాంజనేయులు, ఉడుములపాడు